క్లుప్తంగా

నిబంధనలు మీరితే కఠిన చర్యలు



వెంకటేశ్వరరావు, కడియం ఇన్‌స్పెక్టర్

కడియం: గణపతి ఉత్సవాలను పురస్కరించుకుని నిబంధనలు మీరి వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. గురువారం ఆయనను కలిసిన స్థానిక విలేకరులతో మాట్లాడారు. సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మికత ప్రతిబింబించేలా ఉత్సవాలను నిర్వహించుకోవాలన్నారు. ముఖ్యంగా నిమజ్జనాల సందర్భంగా కమిటీ సభ్యులు జాగ్రత్తలు పాటించాలన్నారు. కాలువలు, చెరువుల వద్దకు వృద్ధులు, పిల్లలను అనుమతించకూడదన్నారు. ముందుగా నిర్దేశించిన మార్గంలో మాత్రమే ఊరేగింపు జరపాలన్నారు.

క్రీడాకారులకు సత్కారం



క్రీడాకారులను సత్కరిస్తున్న ప్రముఖులు

ప్రకాశం నగర్: సుంకర భాస్కరరావు జయంతి సందర్భంగా గురువారం సుంకర భాస్కరరావు మున్సిపాల్ ఉన్నత పాఠశాలలో ముగ్గురు జాతీయ స్థాయి క్రీడాకారులను సత్కరించారు. కేలం శ్రీనివాస్, ఎస్.దొరబాబు, ఏవీడీ ప్రసాద్‌లను పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ వర్రే శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. క్రీడా అభ్యున్నతికి సుంకర భాస్కరరావు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆర్.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

కడియం: విజయవాడ వరద బాధితులకు కడియం ప్రాంత నర్సరీ రైతులు తమ వంతు సాయం అందిస్తున్నారు. కడియపులంక ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ రూ.లక్షను ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి అందించారు. అలాగే మార్గాని సత్యనారాయణ సోదరులు రూ.లక్షను అందజేశారు. కడియపుసావరంలో సేకరించిన రూ.లక్షకు సంబంధించిన చెక్కును స్థానిక నాయకులతో కలిసి సర్పంచ్ చక్కపల్లి మురళి అందించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



కోరుకొండలో వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

మధురపూడి: కోరుకొండ మండలంలోని బాధిత కుటుంబాలను వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి గురువారం పరామర్శించారు. కోరుకొండకు చెందిన గోపిశెట్టి వెంకటేశ్వరరావు, గుమ్ములూరుకు చెందిన తుమ్మల సత్యనారాయణ ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు.

అన్నదాన ట్రస్టుకు భారీ విరాళం



దాత ఝాన్సీకి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ సిబ్బంది

ఐ.పోలవరం: మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో అన్నదాన ట్రస్టుకు ఓ భక్తురాలు భారీ విరాళం అందించారు. రాజమహేంద్రవరానికి చెందిన దుద్ది ఝాన్సీ విజయలక్ష్మి రాణి ఆ ట్రస్టుకు రూ.1,00,116ను గురువారం అందించారు. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్ ద్వారా పంపారు. దాతకు స్వామి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం అందించారు.

సినిమాలు

శ్యామల	: 35 చిన్నకథకాదు
సూర్యమినీ	: ఉత్సవం
సూర్యప్యాలెస్	: ఏఆర్‌ఎం
స్వామి	: సరిపోదా శనివారం
అశోక	: ఉత్సవం
శివజ్యోతి	: మత్తు వదలరా–2
అనుశ్రీ	: మత్తు వదలరా–2
రాజా	: మత్తు వదలరా–2
రంభ	: కళింగ, కమిటీ కుర్రోళ్లు
ఊర్వశి	: భలే ఉన్నాడే
మేనక	: తంగలాన్
కుమారి	: ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్ (గోట్)
అప్సర	: సరిపోదా శనివారం
నామవరం	
వీఎస్ మహల్	: మత్తు వదలరా–2
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: మత్తు వదలరా–2
కడియం	
వెంకటసూర్య	: మత్తు వదలరా–2

ప్రాణాలతో సెల్‌గాటం

- యథేచ్ఛగా సెల్ ఫోన్ డ్రైవింగ్
- తరచూ ప్రమాదాలు
- పోలీసుల నిఘా



బండిపై బాలుడు ఉన్నా లెక్కచేయకుండా సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి



ఫోన్ మాట్లాడుతూ వాహనం నడుపుతున్న యువకుడు

కంబాలచెరువు: సెల్‌ఫోన్ అనేది నేడు ప్రతి ఒక్కరికీ అత్యంత అవసరమైన వస్తువుగా మారింది. అది లేకపోతే కాలు బయట పెట్టలేని పరిస్థితి ఏర్పడింది. గతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు జేబులో డబ్బులు పెట్టుకునేవారు. కానీ ఇప్పుడు సెల్ ఫోన్ ఉంటే చాలు. ప్రయాణం, షాపింగ్, భోజనం, సినిమా, విహారం, వినోదం, ఆర్థిక లావాదేవీలన్నీ క్షణాల్లో చేయవచ్చు. ఫోన్ ఉంటే చాలు ప్రపంచమంతా మన చేతిలోనే ఉంటుంది. ఇంత ముఖ్యమైన సెల్ ఫోన్‌ను విచ్చలవిడిగా వాడడం వల్ల లేనిపోని ప్రమాదాలు జరుగుతున్నాయి. చాలామంది మోటారు సైకిళ్లపై ప్రయాణిస్తూ సెల్ ఫోన్ మాట్లాడుతూ కనిపిస్తున్నారు. భుజానికి, చెవికి మధ్య ఫోన్ పెట్టుకుని మాట్లాడుకుంటూ వెళ్లిపోతుంటారు. ఇది నిబంధనలకు విరుద్ధమని పోలీసులు ఎన్నిసార్లు చెబుతున్నా పట్టించుకోవడం లేదు.

అనేక ప్రమాదాలు

సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడపడం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్నిసార్లు వాహన చోదకులు మృత్యువాత పడుతున్నారు. ఇంకొన్ని సందర్భాల్లో ఎదురుగా వచ్చే వారిని ఢీకొంటున్నారు. సెల్‌ఫోన్‌కి కాల్ వచ్చినప్పుడు రోడ్డు పక్కన బండి ఆపి, మాట్లాడుకుంటే ఎలాంటి సమస్య ఉండదు. కానీ ఆ విషయాన్ని కొందరు అస్సలు పట్టించుకోవడం లేదు. చెవికి, భుజానికి మధ్యలో సెల్ నొక్కిపెట్టి దృష్టి ఎక్కడో పెట్టి వాహనాలను నడుపుతున్నారు. ఈ సెల్‌ఫోన్ డ్రైవింగ్‌తో ప్రమాదాలకు గురై మంచాన పడుతున్న వారు కొందరైతే, మెడలు వంచి ఫోన్ మాట్లాడి అనారోగ్య సమస్యలు తెచ్చుకుంటున్నవారు ఇంకొందరు. ఎక్కువ రోడ్డు ప్రమాదాలకు సెల్ డ్రైవింగ్ ప్రధాన కారణం అవుతోంది.

1,012 కేసులు

ఇటువంటి ప్రమాదాల నివారించడానికి పోలీసులు చర్యలు ప్రారంభించారు. ఫోన్ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్నా వారిపై నిఘా పెట్టారు. దీనిలో భాగంగా రాజమహేంద్రవరం పరిధిలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 1,012 సెల్‌ఫోన్ డ్రైవింగ్ కేసులు నమోదు చేశారు. వీటి నుంచి రూ.10.12 లక్షల జరిమానా వసూలు చేశారు.

యువతే ఎక్కువ

సెల్ ఫోన్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడుతున్న వారిలో యువతే అధికంగా ఉంటున్నారు. వీరిలో విద్యార్థులు ఎక్కువగా ఉండడం గమనార్హం. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, వాహనాన్ని వేగంగా నడపడం వల్ల అనేక ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ విధంగానే రాజమహేంద్రవరం రూరల్‌లో ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఓ యువకుడు ద్విచక్ర వాహనంపై లాలాచెరువు మీదుగా వెళుతూ కూడలిలో లారీకి ఎదురుగా వెళ్లాడు. దీంతో ప్రమాదం జరిగి తీవ్ర గాయాలపాలయ్యాడు. ప్రమాదంపై దర్యాప్తు చేసిన పోలీసులు స్థానికంగా ఉన్న సీసీ పుటేజీలు పరిశీలించారు. ఆ యువకుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్న ఆ యువకుడు ట్రాఫిక్ సిగ్నల్ పడినా గమనించకుండా ఎదురుగా మలుపు తిరుగుతున్న లారీని ఢీకొట్టినట్లు గుర్తించారు. ఇలాగే కోటగుమ్మం సెంటర్‌లో వాహనం నడుపుతున్న ఓ యువకుడు రోడ్డు డివైడర్‌ను ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు.

ప్రమాదకరం



సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం చాలా ప్రమాదకరం. దీని వల్ల ఫోన్ మాట్లాడే వారితో పాటు ఎదురుగా వస్తున్న వాహన చోదకులు కూడా ప్రమాదాల బారిన పడుతున్నారు. డ్రైవింగ్‌లో ఫోన్ వస్తే రోడ్డు పక్కగా వెళ్లి వాహనాన్ని నిలిపి మాట్లాడుకోవాలి. ఈ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. సెల్ ఫోన్ డ్రైవింగ్ చేస్తున్న వారిపై నిఘా పెట్టాం. ఎక్కడికక్కడ తనిఖీలు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నాం.

– ఎం.వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ డీఎస్పీ

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ప్రకాశం నగర్: కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్రం రద్దు చేసి, విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటు పరం చేసే ఆలోచనను ఉపసంహరించుకోవాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వరావు డిమాండ్ చేశారు. స్థానిక టింబర్ మార్చంట్ అసోసియేషన్ హాలులో గురువారం ఐఎఫ్‌టీయూ జిల్లా జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా నాయకుడు శివ అధ్యక్షత వహించగా, వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డి.శ్రీనివాస్, ఎస్.దుర్గారావు, కళింగపట్నం అప్పారావు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ప్రకాశం నగర్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజమహేంద్రవరం విచ్చేసి 80 ఏళ్లు అయిన సందర్భంగా ఈ నెల 28న పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల నాయకులు వెల్లడించారు. ఈ మేరకు గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల నాయకుడు కోరుకొండ చిరంజీవి ఆధ్వర్యంలో గురువారం పోస్టర్ ఆవిష్కరించారు. 1944 సెప్టెంబర్ 28న అంబేడ్కర్ బ్రిటీష్ కౌన్సిల్ మెంబర్ (కార్మిక శాఖ) హోదాలో రాజమండ్రిలో పర్యటించారన్నారు. కోరుకొండ చిరంజీవి, తాళ్లూరి బాబూ రాజేంద్ర ప్రసాద్, కప్పల వెలుగుకుమారి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పోషకాహారం వివరాలు తెలిపే చార్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కంబాలచెరువు: సంపూర్ణ ఆరోగ్యానికి పౌష్టికాహారం ఎంతో అవసరమని లాలాచెరువు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.మల్లేశ్వరరావు అన్నారు. పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో పాఠశాలలో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మ్యాజిక్ బస్ సంస్థ ప్రతినిధి దివ్య మాట్లాడుతూ ఆరోగ్యానికి కావాల్సిన పోషకాహారం క్రమం తప్పకుండా తీసుకుంటేనే విద్యార్థులు చక్కగా చదువుకోగలుగుతారన్నారు. శరీరానికి సరైన వ్యాయామం కూడా అవసరమన్నారు. మేజిక్ బస్ సంస్థ ఆధ్వర్యంలో పోషక విలువల వివరాలు తెలిపే చార్టులను విద్యార్థులతో తయారు చేయించి ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎ.మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు మండల స్థాయి స్కూల్ గేమ్స్

బిక్కవోలు: మండల స్థాయి స్కూల్ గేమ్స్ టోర్నమెంట్, ఎంపికలు శుక్రవారం బిక్కవోలు ఉన్నత పాఠశాల వద్ద జరుగుతాయని ఎంఈవో – 2 కె.పూర్ణచంద్రరావు తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, చెస్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా పోటీలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన అన్ని పాఠశాలలకు చెందిన 14 నుంచి 17 ఏళ్ల వయసున్న క్రీడాకారులందరూ వీటిలో పాల్గొనవచ్చన్నారు. వీటిలో ప్రతిభ చూపిన వారునియోజక వర్గం స్థాయి ఎంపికలలో పాల్గొనడానికి అర్హత సాధిస్తారన్నారన్నారు.

జీఓ 85 రద్దు చేసే వరకూ నిరసన



డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న పీహెచ్‌సీల వైద్యులు

రాజమహేంద్రవరం రూరల్: జీఓ 85ని రద్దు చేసేవరకు తమ నిరసన కొనసాగిస్తామని జిల్లా పీహెచ్‌సీ వైద్యుల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ మౌనిక స్పష్టం చేశారు. స్థానిక డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం ఆవరణలో గురువారం భోజన విరామ సమయంలో పీహెచ్‌సీల వైద్యులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. పీహెచ్‌సీ వైద్యుల నిరసనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తమకు న్యాయం జరిగేలా చూడాలని ఆయనను కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ మౌనిక మాట్లాడుతూ మూడు రోజులుగా నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తున్నామన్నారు. రేపటి నుంచి రెండు రోజుల పాటు అత్యవసర సేవలు మాత్రమే చూస్తారని, ఈ నెల 15వ తేదీన చలో విజయవాడ ర్యాలీ, 16 నుంచి నుంచి నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టడం జరుగుతుందన్నారు. తమ హక్కుల కోసం పోరాడుతూ, తమకు న్యాయం జరిగే వరకు ఈ పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. నిరసనలో అధిక సంఖ్యలో పీహెచ్‌సీల వైద్యులు పాల్గొన్నారు.

21న ఎల్‌ఐసీ ఉద్యోగుల మహాసభ



మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: జీవిత బీమా ఉద్యోగుల సంఘం 27వ వార్షిక మహాసభను ఈ నెల 21వ తేదీన రాజమహేంద్రవరం మోడల్ కాలనీలోని ఉద్యోగుల సంఘం భవనంలో నిర్వహించనున్నట్టు ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుబ్బల రాంబాబు, ఎం.కోదండరామ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఉదయం మోరంపూడిలోని జీవిత బీమా సంస్థ ప్రధాన కార్యాలయ ఆవరణలో మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాలలోని 20 శాఖా కార్యాలయాల ఉద్యోగులు ఈ సభకు హాజరవుతారన్నారు. కోదండరాం మాట్లాడుతూ ముఖ్య అతిథులుగా జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు పి.సతీష్, వి.రవీంద్రనాథ్ హాజరవుతారన్నారు. సుదీర్ఘకాలం ఉద్యోగుల సంఘం నాయకుడిగా పనిచేసి, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఉంటూ స్వచ్ఛందంగా విరమణ చేస్తున్న గుబ్బల రాంబాబును ఉభయ జిల్లాల ఉద్యోగుల సంఘం తరపున సత్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

దుర్వాసన భరించేదెలా..



జాతీయ రహదారిపై హుకుంపేట వద్ద కాలువలో పేరుకుపోయిన చెత్త

హుకుంపేట జాతీయ రహదారి పక్కన ఉన్న కాలువలో చెత్తా చెదారం వేయడంతో విపరీతంగా దుర్వాసన వెలువడుతోంది. ఆ కాలువలో మురుగునీరు పారకుండా ఎక్కడికక్కడ స్థలాలు, షాపుల యజమానులు తూరలతో మూసివేశారు. దీంతో మురుగునీరు ముందుకు ప్రవహించకుండా అక్కడే నిలిచిపోయింది. దీనికి తోడు భవన వ్యర్థాలతో పాటు పంచాయతీకి చెందిన చెత్తను సైతం అక్కడ పారబోస్తున్నారు. హైవేకు ఇరువైపులా ఇదే పరిస్థితి నెలకొంది. కాలువలోని మురుగునీటిలో చెత్త కుళ్లిపోయి దుర్వాసన వెలువడుతోంది. ఆ దారిలో ప్రయాణించేవారు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– రాజమహేంద్రవరం రూరల్

పంట నష్టం అంచనాలు నమోదు చేయాలి



కరకుదురులో నీట మునిగిన వరిదుబ్బును ఏడీఏ రత్న ప్రశాంతికి చూపిస్తున్న రైతు

పెదపూడి: పశ్చిమ ఏలేరు కాలువ ఉధృతితో పాడైన పంటలకు సంబంధించిన నష్టం అంచనాలను అధికారులు త్వరగా తయారు చేయాలని వ్యవసాయశాఖ కాకినాడ ఏడీఏ ఎం.రత్న ప్రశాంతి అన్నారు. మండలంలోని రామేశ్వరం, ఏపీత్రయం, కరకుదురు గ్రామాల్లో పశ్చిమ ఏలేరు కాలువ వరద ఉధృతితో నీట మునిగిన వరి పొలాలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు నీట మునిగిన వరిదుబ్బులను ఆమెకు చూపించి, తమను తక్షణం ఆదుకోవాలని కోరారు. ఏడీఏ రత్న ప్రశాంతి మాట్లాడుతూ వరదలతో 2 వేల ఎకరాల్లో వరి పంట నీట మునిగిందన్నారు. నిబంధనల ప్రకారం పంట నష్టం అంచనాలు తయారు చేయాలన్నారు. ఏడీఏ వెంట ఏఓ టీవీఆర్ మణిదీప్, ఏఈఓ సత్యనారాయణ ఉన్నారు.

తగ్గిన వరద ఉధృతి

ఏపీత్రయం గ్రామంలోని వంతెన వద్ద పశ్చిమ ఏలేరు కాలువ వరద ఉధృతి రెండు అడుగులు మేర తగ్గిందని తహసీల్దార్ పీవీ సీతాపతిరావు తెలిపారు. ఆయన గురువారం ఏపీత్రయం గ్రామంలోని పశ్చిమ ఏలేరు కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు రోజులుగా పెరిగిన వరద ప్రస్తుతం రెండడుగుల మేర తగ్గుముఖం పట్టిందన్నారు. పరిస్థితి అదుపులో ఉందన్నారు. వీఆర్వోలు జి.అంజిబాబు, కె.రమేష్‌బాబు, సచివాలయం కార్యదర్శులు బాలత్రిపుర సుందరి, అచ్చిరాజు తదితర బృందం అప్రమత్తంగా ఉండి పర్యవేక్షణ చేస్తున్నారన్నారు. రామేశ్వరం, ఏపీత్రయం, కరకుదురు గ్రామాల్లో నీటి మునిగిన వరి పొలాలకు పంటనష్టం అంచనాలను అధికారులు తయారు చేస్తున్నారన్నారు.

సౌకర్యాల మెరుగుకు చర్యలు తీసుకుంటాం



డ్రైనేజీలను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నగరాన్ని ఆనుకొని ఉన్న పంచాయతీలలో సౌకర్యాలు మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్, శివారు గ్రామ పంచాయతీల స్పెషల్ ఆఫీసర్ కేతన్ గార్గ్ అన్నారు. దివాన్ చెరువు, హుకుంపేట పంచాయతీలలో గురువారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి పనుల ప్రతిపాదనలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దివాన్ చెరువు పంచాయతీలో మురుగు నీరు పారడానికి అడ్డంగా ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని, పారిశుధ్య నిర్వహణలో అలసత్వం ప్రదర్శించరాదన్నారు. హుకుంపేట పంచాయతీలో కాలువలను పరిశీలించి ఆదేశాలు జారీ చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: మరమ్మతుల నేపథ్యంలో రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు.

- ఉదయం 7 నుంచి 11 గంటల వరకూ ఆర్అండ్‌బీ, వాంబే గృహాల ప్రాంతం, రాజీవ్ గాంధీ కాలనీ, మున్సిపల్ కాలనీ, రత్నంపేట, కోరుకొండ రోడ్డులని రాజా థియేటర్ ప్రాంతాలలో అంతరాయం కలుగుతుంది.
- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఆర్‌వీ నగర్, వీవర్స్ కాలనీ, విద్యానగర్ ఏరియాలలో సరఫరా ఉండదు.
- ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కొత్తపేట, సోమాలమ్మ డౌన్, రౌతు తాతాలు కల్యాణ మండపం, చర్చి పేట, ఊర్వశి థియేటర్ ఏరియా, మేదరపేట, సెంట్రల్ వెజిటబుల్ మార్కెట్, నల్లమందు సందు, చర్చి పేట, మెరక వీధి, గంటాలమ్మ గుడి, గొల్లలమారమ్మ గుడి, రంభ ఊర్వశి డౌన్, కుమ్మరి వీధి, ఆర్య వైశ్య కల్యాణ మండపం వీధి, శ్యామల టాకీస్ రోడ్డు, సాయికృష్ణ థియేటర్, డీలక్స్ సెంటర్, టౌన్ హాల్ రోడ్, పాత కాంగ్రెస్ భవన్, వన్ టౌన్ పోలీస్ స్టేషన్, గీతా భవన్, సూరా బత్తుల వీధి, మంగళవారపు పేట, ట్రైనింగ్ కాలేజీ, గోదావరి బండ్, మదర్ సింగ్ పేట, బైపాస్ రోడ్, వంకాయలవారి వీధి, నీలాజీయర్ ఆసుపత్రి, మహాత్మాగాంధీ కాంప్లెక్స్, రెల్లిపేట, షెలన్ హోటల్, డీఎంహెచ్ స్కూల్, గోరక్షణపేట, జాంపేట, ఫిష్ మార్కెట్, ఆజాద్ చౌక్ ఏరియాలలో విద్యుత్ ఉండదు.
- ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సాయి నగర్, ఏవీ అప్పారావు రోడ్డు, సాయి నేతాజీ టవర్స్, బాలాజీ స్ట్రీట్, శారదా నగర్, షీలా నగర్, గోపాలనగర్ పుంత, శ్రీనివాస గార్డెన్స్, అద్దేపల్లి కాలనీ పరిసర ప్రాంతాలలో సరఫరా నిలిపివేస్తారు.
- ఉదయం 7 నుంచి ఒంటి గంట వరకూ కొంతమూరులోని నూకాలమ్మ గుడి ప్రాంతం, ముస్లిం పేట, అంబేడ్కర్ పేట, అఫీషియల్ కాలనీ, పంచాయతీ ప్రాంతం, కాతేరు రోడ్డు, బూసమ్మ కాలనీ, బ్రాహ్మణ అగ్రహారం, శ్రీరామ్ నగర్, బీసీ కాలనీ, కాతేరులో సరఫరా ఆపేస్తారు.
- ఉదయం 8 నుంచి 12 గంటల వరకు అన్నపూర్ణమ్మపేట, మదన్ సింగ్ పేట, జాంపేట, లక్ష్మీవారపుపేట, సీతపేట, మూలగొయ్యి సెంటర్, ఎన్‌టీఆర్ కాలనీ, రామాలయం ఏరియాలలో విద్యుత్ నిలిపివేస్తారు.
- ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఆర్టీఓ కార్యాలయం, వాటర్ ట్యాంక్, గాంధీపురం, నారాయణపురం, మేనకా బార్, ఎస్‌బీ మోటార్స్, ఆంధ్రాబ్యాంక్, సుబ్బారావు పేట, ఎస్‌బీఐ కాలనీ, సుబ్రహ్మణ్యం నగర్, సైక్లోన్ కాలనీలలో సరఫరా ఉండదు.